## క్లుప్తంగా

### ట్రాక్టర్ ఫీజు.. కారుకు రశీదు

**నేలకొండపల్లి:** టోల్ ప్లాజా వద్ద రైతుల ట్రాక్టర్ల ద్వారా వెళ్లి వస్తుండగా, ఫీజు వసూలు చేస్తుండడంపై నిరసన వెల్లువెత్తుతోంది. మండలంలోని పైనంపల్లి సమీపాన టోల్‌గేట్ మీదుగా రైతు శంకర్ శనివారం ట్రాక్టర్‌లో ఇసుక తీసుకెళ్తుండగా ఆపారు. ఫీజు చెల్లించాల్సిందేనని సిబ్బంది పట్టుబట్టడంతో ఆయన రూ.130 చెల్లించాడు. కానీ ట్రాక్టర్ పేరిట కాకుండా కారుకు ఫీజు చెల్లించినట్లు రశీదు ఇచ్చారు. కాగా, రైతులు నిత్యం ట్రాక్టర్లపై వచ్చివెళ్తున్నందున ఫీజు రద్దు చేయాలని పలువురు కోరారు.

### సన్మానం..

**ఖమ్మం మామిళ్లగూడెం:** రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్‌గా నియమితులైన ఖమ్మం జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్టు పీవీ శ్రీనివాసరావుకు తెలంగాణ ఆస్పత్రి న్యూరో సర్జన్ డాక్టర్ మురళి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఖమ్మం వచ్చిన ఆయనను ఎన్నెస్పీ అతిథి గృహంలో ఆస్పత్రి పీఆర్‌ఓ దాసరి శ్రీనుతో కలిసి సన్మానించారు.

### ఐఐఎంలో విద్యార్థిని సత్తా..


జ్యోత్స్న

**కూసుమంచి:** మండలంలోని ఎర్రగడ్డతండాకు చెందిన బాణోత్ రామ్‌కుమార్, పద్మ కుమార్తె జ్యోత్స్న ఆలిండియా స్థాయిలో నిర్వహించిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) ప్రవేశ పరీక్షలో సత్తా చాటింది. 75 శాతం మార్కులతో పంజాబ్‌లోని అమృతసర్ కళాశాలలో సీటు సాధించింది. దీంతో తల్లిదండ్రులతో పాటు పలువురు తండావాసులు అభినందనలు తెలిపారు.

### ఆశాల సమస్యలు పరిష్కరించాలి

**ఖమ్మంరూరల్:** ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పి.మోహన్‌రావు శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆశాలు చేస్తున్న సేవలను పాలకులు గుర్తించకపోవడం దారుణమన్నారు. పేదలకు వైద్యంపై అవగాహన కల్పించడం దగ్గర నుంచి సేవలు అందిస్తున్న వారికి సరైన వేతనాలు అందడం లేదని, పనికి తగిన వేతనం ఇవ్వాలని కోరారు. వారి కుటుంబమంతటికీ బీమా సౌకర్యం కల్పించాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలన్నారు.

### 'బీసీలకు అన్నివిధాలుగా అన్యాయమే..'


సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

**ఖమ్మం మామిళ్లగూడెం:** జిల్లాలో బీసీలకు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అన్యాయం జరుగుతుందని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకుపల్లి నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఖమ్మం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ కులాలను ఎప్పటికీ ఓటర్లుగానే చూస్తున్నారని, సర్పంచ్ నుంచి మొదలుకొని ఎంపీటీసీ, జెడ్పీటీసీ సీట్లలో కూడా వీరికి సరైన ప్రాధాన్యత కల్పించకపోవడం దారుణమన్నారు. ఈనెల 27న ఖమ్మంలో నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పల్లె పాంగువిజయ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి మిరియాల నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# కొనలేం.. కట్టలేం..


దుకాణంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న సిమెంట్


ఇసుక తోలకాలు

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ధరల సెగ

- పెరిగిన ఇనుము, ఇసుక, ఐరన్ ధరలు
- సామాన్యులకు భారంగా మారిన వైనం
- ఆందోళనలో లబ్ధిదారులు
- ప్రభుత్వం చొరవ చూపాలని వేడుకోలు

**నేలకొండపల్లి:** ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఓ పక్క సంతోషంగా ఉన్నా.. మరో పక్క పెరిగిన ధరలతో ఆందోళన చెందుతున్నారు. సిమెంట్, ఇసుక, ఐరన్ ధరలు అమాంతం పెరగడంతో సామాన్యులపై అదనపు భారం పడుతోంది. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా నియోజకవర్గాలకు ఇళ్లు మంజూరు చేయగా.. ఇంటి నిర్మాణాలు ప్రారంభించేందుకు పనులు చేపట్టారు. అయితే ధరలు వింటేనే ఇల్లు కట్టాలా.. వద్దా అనే సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఒక్క నెలలోనే సిమెంట్‌కు దాదాపు రూ.70 నుంచి రూ.80 వరకు పెరిగడం గమనార్హం.

**లబ్ధిదారుల ఆందోళన..**

ఇందిరమ్మ ఇంటి నిర్మాణం ప్రభుత్వం సూచించిన విధంగా నిర్మించాలంటే కనీసం 350 సిమెంట్ బస్తాలు అవసరం ఉంటుంది. అదే గృహ యజమానులు పిల్లర్లతో నిర్మించాలంటే కనీసం 550 బస్తాలు అవసరం పడుతుంది. గత నెలతో పోలిస్తే సిమెంట్‌కు దాదాపు రూ.70 నుంచి రూ.80 వరకు ధర పెరిగింది. అంటే రూ.320 ఉండాల్సి బస్తా ప్రస్తుతం రూ.395 వరకు చేరింది. ఓ కంపెనీ రూ.220 నుంచి రూ.270 వరకు పెంచగా.. చాలా కంపెనీలు దాదాపు రూ.80 వరకు పెంచేశారు. ఒక్క సిమెంట్ వలనే లబ్ధిదారులకు రూ.10 వేల వరకు అదనపు భారం పడుతోంది. ఇక ఇసుక అధికారులు దాడులు చేస్తున్నారనే నెపంతో రేటును అమాంతం పెంచేశారు. ట్రాక్టర్ ఇసుక రూ. 4 వేల నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారు. అయినా చేసేదేమీ లేక లబ్ధిదారులు కొనుగోలు చేస్తున్నారు. ఐరన్ గత నెలకు ఇప్పటికి దాదాపు టన్నుకు రూ. 8 వేల వరకు పెరిగింది. ఇలా ధరలు పెరగడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

**ధరలు తగ్గించాలి..**



ప్రభుత్వం మాకు ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేసింది. చాలా సంతోషంగా ఉన్నాం. కాగా సిమెంట్, ఇసుక ధరలను తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుని ఆదుకోవాలి. తమపై భారం పడకుండా తగిన ఏర్పాట్లు చేయాలి.

– కుమ్మరి దేవకర్ణ, లబ్ధిదారులు, కోనాయిగూడెం

**సబ్సిడీపై అందించాలి..**



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సిమెంట్, ఇసుక, ఐరన్‌లను సబ్సిడీపై అందించేందుకు చర్యలు తీసుకోవాలి. లబ్ధిదారులపై అదనపు భారం పడకుండా మెటీరియల్లను ప్రభుత్వమే అందిస్తే బాగుంటుంది. మా బాధలను కూడా గుర్తించాలి.

– వడ్లమూడి నర్సయ్య, లబ్ధిదారుడు, అనంతనగర్

**అదనపు భారం..**



ధరలపై నియంత్రణకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలి. సామాన్యులకు ఇళ్లను మంజూరు చేయడంతో పాటు మెటీరియల్‌పై కూడా ప్రత్యేక దృష్టి సారించాలి. ఇబ్బందులను గుర్తిస్తే రుణపడి ఉంటారు.

– పాల్తీయ శ్రీనివాసరావు, కార్మిక సంఘం నేత, నేలకొండపల్లి

## పేదల సంక్షేమమే లక్ష్యం..

☛ ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి


నేలకొండపల్లిలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి

**నేలకొండపల్లి:** పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చెరువుమాధారం, బుద్ధారం, నేలకొండపల్లి, గువ్వలగూడెం గ్రామాల్లో పర్యటించి ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలను అమలు చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిర్మాణాలు శరవేగంగా పూర్తి చేసుకోవాలన్నారు. సబ్సిడీపై ప్రభుత్వం అందించే విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్లమెంట్ పరిధిలో రూ.14 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం కోసం ప్రణాళికలను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నాయకులు శాఖమూరి రమేష్, వెంకన్న, జెర్రిపోతుల అంజిని, బచ్చలకూరి నాగరాజు, బాలాజీ, భద్రయ్య, జెర్రిపోతుల సత్యనారాయణ, మామిడి సుభద్ర, కడియాల నరేష్, వడ్డె జగన్, మేకల వెంకటేశ్వర్లు, గుండా బ్రహ్మం, హనుమంతరావు, కొమ్మినేని విజయ్, కైలాసపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

**సర్దార్ పటేల్ స్టేడియం సందర్శన..**

**ఖమ్మం స్పోర్ట్స్:** నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియాన్ని ఎంపీ రఘురాంరెడ్డి శనివారం సాయంత్రం సందర్శించారు. రూ.8.5 కోట్లతో కొత్తగా నిర్మాణం చేపట్టిన సింథటిక్ ట్రాక్ పనులను పరిశీలించి జిల్లా క్రీడల అధికారి తుంబూరు సునీల్‌రెడ్డికి పలు సూచనలు చేశారు. ట్రాక్ వెంట తగ్గించాల్సిన పనుల గురించి ఎంపీ వివరించారు. అనంతరం అథ్లెటిక్స్, జిమ్, క్రికెట్, స్విమ్మింగ్‌పూల్, షటిల్, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం క్రీడాకారులతో మాట్లాడి ఉత్సాహం నింపారు. అలాగే నగరంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానంలో వాకర్లను కలిసి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

**వినతి..**

**ఖమ్మం మామిళ్లగూడెం:** నాయీ బ్రాహ్మణులను ఎస్సీ జాబితాలో చేర్చాలని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యాన శనివారం ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఖమ్మం నగర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఐక్యవేదిక ఆధ్వర్యాన ఎంపీ రఘురాంరెడ్డి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు యలమందల జగదీష్, గుండ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. నగరంలో కార్పొరేటర్ సెలూన్లలను నివారించాలని, నాయీ బ్రాహ్మణులను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదుగుదలకు తోడ్పడాలని కోరారు.

## వ్యాపారాలకు ట్రేడ్ లైసెన్సులు తప్పనిసరి


మాట్లాడుతున్న మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్

**ఖమ్మంమయూరిసెంటర్:** నగరంలో వ్యాపారాలు సాగించేందుకు ట్రేడ్ లైసెన్సులు తప్పనిసరి అని, అలా లైసెన్స్ లేకుండా వ్యాపారాలు సాగిస్తున్న వారిని గుర్తించాలని కేఎంసీ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా ఆదేశించారు. శనివారం కేఎంసీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, బిల్లు కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్‌ఐలు, బిల్లు కలెక్టర్లు తమ పరిధిలో ఉన్న వ్యాపార సముదాయాలను పరిశీలించి లైసెన్సులు లేని వారిని గుర్తించాలన్నారు. ట్రేడ్ లైసెన్సులు లేకుండా వ్యాపారాలు చేస్తున్న వారిపై మున్సిపల్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే నగరంలో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు జూన్ 2 నుంచి వంద రోజుల ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. ప్రతీ డివిజన్‌లోని డ్రెయినేజీల్లో పేరుకుపోయిన మురుగును, రోడ్ల పక్కన ఉన్న వ్యర్థాలు, పిచ్చిమొక్కలను తొలగించి చెట్ల కొమ్మలను కత్తిరించాలని, ఖాళీ స్థలాల్లో నీరు నిల్వకుండా చూడాలని, ఆ స్థలాలను శుభ్రం చేసుకునేలా యజమానులకు సూచించాలన్నారు. శిథిలావస్థకు చేరిన భవనాలను డివిజన్ల వారీగా గుర్తించి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. పారిశుద్ధ్య కార్మికుల కోసం ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో శానిటరీ సూపర్‌వైజర్ ఎం.సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఉపసంహరించుకోవాలి

**కూసుమంచి:** ఎస్సీ గురుకులాలను ప్రభుత్వం తీసేయడం సరికాదని, ప్రభుత్వం ఈ ఆలోచనను విరమించుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గోకినపల్లి మస్తాన్ ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 ఎస్సీ గురుకులాల్లో జూనియర్ కళాశాలలను మూసివేసేందుకు రంగం సిద్ధం చేసిందని, అట్టి నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేకుంటే ఆందోళనలను చేపడతామని హెచ్చరించారు.

### గీతకార్మికుడికి తీవ్ర గాయాలు

**కూసుమంచి:** కూసుమంచి గ్రామానికి చెందిన గీత కార్మికుడు మంద వెంకన్న (58) శనివారం ఉదయం తాటిచెట్టు ఎక్కి దిగే క్రమంలో ప్రమాదవశాత్తు మోకు జారి కిందపడ్డాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

## వానలు రాకముందే పనులు పూర్తవ్వాలి

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**


కోటపాడులో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

**రఘునాథపాలెం:** రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు వానాకాలానికి ముందే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. శనివారం మండలంలోని కోటపాడులో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్సీ కాలనీలో రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కోయచలక, పాపటపల్లి రోడ్డులో రూ.99 లక్షలతో చేపట్టనున్న వంతెన నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు.ఇందిరమ్మ ఇళ్లకు అర్హుల జాబితాలను, గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి ప్రహరీ, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. విద్యుత్ సమస్యలు, రోడ్ల నిర్మాణ తదితర వాటిపై గ్రామస్తుల నుంచి విజ్ఞప్తులు స్వీకరించి తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, పీఆర్ ఎస్‌ఈ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ శ్వేత, ఆర్‌అండ్‌బీ, వ్యవసాయ, విద్యుత్ శాఖల అధికారులు యుగంధర్, పుల్లయ్య, కొంగర వెంకటేశ్వర్లు, రామారావు, సంజయ్‌కుమార్‌లతో పాటు మానుకొండ రాధాకిషోర్, కొంటెముక్కల నాగేశ్వరరావు, దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, తాతా రఘురాం, యండపల్లి సత్యం, బాతుల రమణి సుధాకర్, కొంటెముక్కుల నాగేశ్వరరావు, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## డ్రెయినేజీ సమస్య రానివ్వొద్దు..


3వ డివిజన్‌లో డ్రెయినేజీలను పరిశీలిస్తున్న మేయర్

**ఖమ్మంఅర్బన్:** కాలనీల్లో డ్రెయినేజీ వ్యవస్థను ఎప్పటికప్పుడు మెరుగుపర్చాలని, డ్రెయిన్లు లేని ప్రాంతాల్లో నిర్మాణాలకు తగిన విధంగా అంచనాలు సిద్ధం చేయాలని నగర మేయర్ పునుకొల్లు నీరజ అధికారులను ఆదేశించారు. శనివారం 3వడివిజన్‌లో పర్యటించి రామాలయం వీధి, బీసీ కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థను పరిశీలించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. వర్షాకాలంలో మురుగు సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం 2వ, 26వ డివిజన్లలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆమె వెంట ఈఈ కృష్ణలాల్, డీఈ ధరణికుమార్, ఏఈ వలీ, తేజ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామయ్య, కొండల్, 2వ డివిజన్ కార్పొరేటర్ మలీదు వెంకటేశ్వర్లు, మలీదు మనీష్, నరేష్, చిర్రా శరత్, చంద్రం, కోటి, ఉపేందర్ తదితరులు ఉన్నారు.

### సమాచారం..

**☛ నేడు విద్యుత్ అంతరాయం**

**ఖమ్మంవ్యవసాయం:** నగరంలోని 11 కేవీ సహకార నగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్లకు ఆటకంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్-3 సెక్షన్ ఏఈఈ జి.వెంకన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు గట్టయ్యసెంటర్, సహకారనగర్, మున్సిపల్ ఆఫీస్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈఈ కోరారు.

**☛ రేపటి నుంచి పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ**

**తిరుమలాయపాలెం:** తిరుమలాయపాలెం సొసైటీ కార్యాలయంలో ఈ నెల 26 నుంచి పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉంటాయని మండల వ్యవసాయాధికారి నారెడ్డి సీతారాంరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి 250 క్వింటాళ్ల జీలుగులు, 150 క్వింటాళ్ల జనుము, 5 క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలు వచ్చినట్లు తెలిపారు. జీలుగుల ధర 30 కేజీల బస్తా రూ. 2137.50, జనుము 40 కేజీల బస్తా రూ. 2510, పిల్లిపెసర 20 కేజీల బస్తా రూ. 2055 ఉన్నట్లు చెప్పారు. పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు తమ ఆధార్ కార్డుతో పాటు పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్ కాపీలతో సంప్రదించాలన్నారు.

### దాతల దాతృత్వం

**☛ మృతుడి కుటుంబానికి బియ్యం..**

**రఘునాథపాలెం:** మండలంలోని చిమ్మపుడి గ్రామానికి చెందిన గొర్రె మాధవరావు ఇటీవల మృతి చెందగా.. ఆయన కుటుంబాన్ని శనివారం ఖమ్మం జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు, మాజీ గ్రామ ఉప సర్పంచ్ గుత్తా వెంకటేశ్వర్లు పరామర్శించి 50 కేజీల బియ్యం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ వార్డు సభ్యులు గంగిరెడ్డి విజయరెడ్డి, గుండ్ల ముత్తయ్య, సచ్చు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

**☛ గోశాలకు పశుగ్రాసం..**

**నేలకొండపల్లి:** ప్రముఖ వ్యాపారి మాటూరి సుబ్రహ్మణ్యం-శ్రీదేవి దంపతుల కుమార్తె ఉదయలక్ష్మి పుట్టిన రోజు సందర్భంగా ఖమ్మం గోశాలకు ట్రాక్టర్ వరిగడ్డిని వితరణ చేశారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ గ్రేటర్ అధ్యక్షుడు నాగుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పుట్టిన రోజు సందర్భంగా ఆడంబరాలకు ఖర్చు చేయకుండా గోశాలకు పశుగ్రాసం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రేగూరి హనుమంతరావు, యర్రా నాగేశ్వరరావు, తెల్లాకుల అశోక్, దోసపాటి చంద్రశేఖర్, తెల్లాకుల జయశ్రీ, కొత్తా కరుణ, బొనగిరి రామశేషయ్య, క్రాంతికిరణ్, దోసపాటి అచ్యుత్‌రామయ్య, ఎండూరి బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

## 'ఉపాధి' కూలీలకు ఇన్సూరెన్స్ కల్పించాలి

**రఘునాథపాలెం:** గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు ప్రభుత్వం ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాపనేని వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని గణేశ్వరం, జింకలతండా, మంచుకొండ గ్రామాల్లో ఉపాధి హామీ పనులపై వ్యవసాయ కార్మిక సంఘం నేతలు పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులతో మాట్లాడిన ఆయన కేంద్రం ప్రభుత్వం ఉపాధి హామీ పనులను బలోపేతం చేయాలని, రోజువారీ వేతనాన్ని రూ.600లకు పెంచాలని, పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పనికి అవసరమైన పనిముట్లు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ నెల 30న ఖమ్మం కలెక్టరేట్ వద్ద నిర్వహించే ముట్టడిని జయప్రదం చేయాలని కార్మికులను పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు తిరుపయ్య, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

**కొత్త జాబ్ కార్డులు అందించండి..**

**కామేపల్లి:** గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు కొత్త జాబ్ కార్డులు అందించి, ప్రతి కూలీకి పని కల్పించాలని సీపీఎం జిల్లా నాయకుడు దుగ్గి కృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జాస్తిపల్లి గ్రామంలో ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సందర్శించి కూలీలతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కుట్రలో భాగంగానే ఉపాధి హామీ పథకాన్ని తగ్గిస్తుందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లను పర్మినెంట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం మండల కార్యదర్శి బాదావత్ శ్రీను, రాయల సత్యనారాయణ, ఉప్పతల వెంకన్న, మంగీలాల్, వీరభద్రం, ఉపేందర్ పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

**☛ సమ్మర్ క్యాంప్‌తో నూతనోత్సాహం**

**ఖమ్మం సహకారనగర్:** ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్ విద్యార్థులకు ఎంతగానో దోహదపడిందని ఖమ్మం అర్బన్ ఎంఈఓ శైలజలక్ష్మి అన్నారు. శనివారం నగరంలోని నయాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 11 నుంచి శనివారం వరకు నిర్వహించిన సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమానికి హాజరైన ఆమె ప్రసంగించారు. సమ్మర్ క్యాంపు ద్వారా విద్యార్థుల్లో నూతనోత్సాహం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ చైర్మన్ రేఖ, పాఠశాల హెచ్‌ఎం సుధారాణి, ఉపాధ్యాయులు నవీన, హర్ష, శ్రీధర్, మాధవరావు పాల్గొన్నారు.

**☛ మెస్ చార్జీలు విడుదల చేయాలి**

**ఖమ్మం మామిళ్లగూడెం:** వసతి గృహాల మెస్ చార్జీలు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ దామళ్ల సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తారు. శనివారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎస్టీ, ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టల్లో ఏడాదికాలంగా మెస్ బిల్లులు రాగా ఇబ్బంది పడుతున్నారన్నారు. రాబోయే విద్యా సంవత్సరానికి విద్యార్థులకు ఎక్కడా ఇబ్బంది లేకుండా వసతి గృహాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని, ఫీజ్ రీయింబర్స్‌మెంట్‌పై దృష్టి సారించి విద్యార్థులకు అండగా నిలవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో శ్రీనివాస్, దాము, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

**☛ అష్టోత్తర వైభవంపై ప్రవచనాలు**

**ఖమ్మంగాంధీచౌక్:** నగరంలోని కమాన్‌బజార్ శ్రీవేంకటేశ్వర దేవస్థానంలో శనివారం సాయంత్రం అష్టోత్తర వైభవంపై త్రిదండి దేవనాథ జీయర్ స్వామి ప్రవచనం చేశారు. చాతుర్మాసం సందర్భంగా ఉత్తర భారతంలోని మధుర పక్కన ఉన్న బృందావనంలో నిర్వహించనున్న కార్యక్రమాల దృష్ట్యా అష్టోత్తర వైభవం ప్రాముఖ్యతపై భక్తులకు ప్రవచనాలను వినిపించారు. వికాస తరంగిణి ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ కె.వేణుగోపాలచారి, వికాస తరంగిణి నిర్వాహకుడు పోలా శ్రీనివాస్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

**☛ తహసీల్ ఎదుట ఆందోళన**

**కూసుమంచి:** మండలంలోని గట్టుసింగారం గ్రామానికి చెందిన ఇద్దరు దళితుల భూముల్లో వేరొక వ్యక్తికి దారి ఇవ్వాలంటూ తహసీల్దార్ కరుణశ్రీ ఒత్తిడి చేస్తున్నారని ఆరోపిస్తూ శనివారం బాధితులతో పాటు పలువురు తహసీల్ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా బీడీఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గోపె వినయ్‌కుమార్, బీఆర్‌ఎస్ బీసీ సెల్ పాలేరు డివిజన్ అధ్యక్షుడు బారి మల్సూర్ మాట్లాడారు. గ్రామానికి చెందిన కలకొండ వీరస్వామి, లంజపల్లి ఈదయ్య తమ భూములపై గత 50 ఏళ్లుగా పూర్తి హక్కులు కలిగి ఉన్నారని, అట్టి రైతుల భూముల్లో నుంచి వేరే వ్యక్తికి దారి ఇవ్వాలని తహసీల్దార్ బెదిరిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. బాధితుల భూములకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కాగా, అట్టి భూములకు నష్టం వాటిల్లకుండా గ్రామంలో చర్చించి తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్‌హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో పెరుగు సైదుబాబు, బొజ్జ ఉపేందర్, మేడేపల్లి ఉపేందర్, చాట్ల రత్నమ్మ, రాజు, నీలమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

**☛ ప్రభుత్వ స్థలం గుర్తింపు..**


సర్వే చేస్తున్న ఆర్ఐ, సర్వేయర్

సాక్షి ఎఫెక్ట్..

**ఖమ్మంఅర్బన్:** ప్రభుత్వ మిగులు భూమి ఆక్రమణ ప్రయత్నంపై శనివారం సాక్షిలో ప్రచురితమైన 'ఆధిపత్య పోరు..'కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. ఈక్రమంలో తహసీల్దార్ డి.సైదులు ఆదేశాల మేరకు ఆర్‌ఐ సాయినరేష్, సర్వేయర్ నరిసింహారావులు నగరంలోని 4వ డివిజన్ మంచికంటినగర్‌లోని సాగర్ కాల్వ మిగులు భూమి ఆక్రమణలను గుర్తించారు. వెంటనే సర్వే చేసి మొత్తం 35 కుంటలు ఉన్నట్లు తహసీల్దార్ తెల్పి చెప్పారు. సదరు భూమిని ప్రభుత్వ అవసరాల నిమిత్తం హద్దులు ఏర్పాటు చేసి కార్పొరేషన్‌కు అప్పగించనున్నట్లు పేర్కొన్నారు. ఎక్కడైనా ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే సహించేది లేదని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**☛ విత్తన దుకాణాల్లో ఏడీఏ తనిఖీ**

**కూసుమంచి:** మండలంలోని పలు విత్తన దుకాణాలను శనివారం ఏడీఏ సరిత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తనాల లైసెన్స్‌లు, స్టాక్ బోర్డులను పరిశీలించి దుకాణాల్లో నిలువ ఉన్న విత్తనాలకు సంబంధించిన లెక్కలు తనిఖీ చేశారు. డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలని, అమ్మిన ప్రతీ ప్యాకెట్‌కు రశీదు ఇవ్వాలని సూచించారు. ధరల పట్టిక, స్టాక్, లైసెన్స్‌లను కనిపించేలా దుకాణాల్లో ప్రదర్శించాలన్నారు. నిబంధనలు పాటించని వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఏఓ వాణి పాల్గొన్నారు.

**☛ అప్రమత్తత అవసరం**

**ఖమ్మంవ్యవసాయం:** ఈదురుగాలులు, వర్షాల నేపథ్యాన విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ఖమ్మం ఎన్పీడీసీఎల్ సర్కిల్ ఎస్‌ఈ ఇనుగుర్తి శ్రీనివాసా చారి శనివారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. వాతావరణ శాఖ రానున్న రోజుల్లో వర్ష సూచన చేసిన క్రమంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎక్కడైనా తెగిపడిన విద్యుత్ వైర్లు కనబడినా, విద్యుత్ సమస్యలు తలెత్తినా వెంటనే టీజీఎన్పీడీసీఎల్ టోల్ ఫ్రీ నంబర్ 1912 ద్వారా తెలపాలన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


ఖమ్మంసహకారనగర్: మాట్లాడుతున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

**తిరుమలాయపాలెం:** ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఏ.వీ.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని పిండిప్రోలు ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని శనివారం సందర్శించిన ఆయన ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడారు. ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బకాయిలు చెల్లించాలని, కొత్త పేస్కేల్ ఇవ్వాలని, బదిలీలు, ప్రమోషన్స్ వెంటనే ఇవ్వాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులందరికీ వృత్యంతర శిక్షణ అవసరమేనన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు, జిల్లా కౌన్సిలర్ వీరభద్రం, మండల శాఖ బాధ్యులు వీరబాబు, భద్రయ్య, రవికిషోర్, ప్రశాంత్, శరత్ బాబు, వసంత రాణి, సూక్యా, హరిలాల్, అరుణదేవి తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థుల అభ్యున్నతికి కృషి..**

**నేలకొండపల్లి:** విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వై.వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణలో పాల్గొని ప్రసంగించారు. బడిబాట కార్యక్రమంలో పిల్లలను ఎక్కువ సంఖ్యలో చేర్పించేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారావు, రత్నకుమార్, మండల అధ్యక్ష, కార్యదర్శులు బోయిన శ్రీనివాసరావు, టి.సురేష్, బొమ్మ శ్రీను, రూప్సీ, భవాని, కోమలి, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

**బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలి..**

**ఖమ్మంసహకారనగర్:** విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు అన్నారు. ఖమ్మంలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. నూతన సాంకేతికతను ఉపయోగించి విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారావు, ఉపాధ్యక్షులు కట్టా శేకర్‌రావు, టి.రత్నకుమార్, తాళ్లూరి చంద్రశేఖర్, ఆంజనేయులు, సతీష్, జీవీ రమణ, పాపారావు, కృష్ణవేణి, మాధవి తదితరులు పాల్గొన్నారు.